# ఎంకన్న

ఈ సారి తప్పక సీతక్క కట్తది. లేదు; మళ్ళసారికి; కాదు లేదు; కట్టనే లేదు సీతక్క. ఏం దిది? ఏం లేదు. కర్ణపురాజయ్యమందల కంటికి ఆనే కొడె ఉన్నవి; కొన్నాళ్లు ఆమందల గల్పి సూస్తే? సూడుండి తప్పేముంది? అయిన గని ఏమి లేదు. ఎక్కడలేదు. అయ్యోకత! ఎట్లమరి? ఆఁ! ఎట్ల లేదు. గిట్లలేదు. మరీ అపురూపరం ఎక్కువైంది. గడెం గడ్తే సరి. రోగం గుదుర్తది. కట్టిసూడుండి.

సరె! సీతక్కను గడెం దోల్రిను. ముక్తమ్మ జూసింది. ఆవలీవల వడ్డది. సీతక్క మెడమీది కాణి తన మెడ మీద వెట్టినట్లనిపిచ్చింది. బిర బిర నడ్సింది మిర్పగుడ్డెం లకు, "ఇదేం? కచ్చుతనం రా నాయిన? గున్న ఏన్గ సొంటి సీతక్కను గడెం గట్రిను? మీకు చేతు లెట్లొచ్చెరా తండ్రి? సీతక్కెం గొడ్డు వోదు. ఈయాళ్ళ గాకుంటె రేపాయె; ఎల్లుండి ఆయె. నిన్ననే చెల్లెలు కారటు రాసింది- నా సీతక్క ఎట్లుండి? అని చెల్లె: నీవు గుమ్మడిపండును గన్నవు గదా! ఇంగ సీతక్క రామలక్ష్మణుల వెడ్తది, ఉండు, అని రాసిన. ఆ పిల్ల పాపం: ఎండిపట్టెడ చే పిచ్చిపెట్టుంపి అని ముప్పై రూపాయలు వంపింది. పట్టెడేమొ గాని సీతక్క మెడ లొంచి బరువు వెడ్తిరి ఇడ్వుంది గడెం" అని ఇడ్పిచ్చింది.

ఎంకట్రాంరెడ్డి శ్రీరంగాపురం బోయి వొచ్చిండు. వొస్త వొస్త రెండు వేలువోసి రొంపుకోడెలు వెచ్చిండు. ఒగటి తెల్లకోడె: ఇంగోటి బొల్లికోడె



76A

కోడెలు రొండు మాంచి పొగర్ల ఉండవి. తెచ్చుకం తెచ్చుక మే ఎంకట్రాంరెడ్డి బాప నాగిరెడ్డి సుట్టపు సూపున వొచ్చి నోడు తెల్లకోడెను నాకిచ్చేడి దంక గా దని పట్టుపట్టిండు. సరె నన్నడు ఎంకట్రాంరెడ్డి. కోడెను గొట్కపోయిండు, నాగిరెడ్డి. ఇంగ బొల్లికోడెను 'ఎంకన్న' అని పిల్సి, ఎంకట్రాంరెడ్డి మందల గల్పింద్రు గాసగాండ్లు.

సీకటివడంగనె ఎండ్లపాలెల గట్టిన్రు ఎంకన్నను. తెల్లారింది పసుల పోరలొచ్చి, మెడ పల్పు లిడ్సి, గాడి సాపుజేసిన్రు. పల్పు ఇడ్వబోతె బుస్సు మన్నడు ఎంకన్న 'అమ్మో ! ఈ కొత్తగుల్లు రేపు కోళ్ళగుయ్యేంగ మోటగడ్తె, బర్తిమోస్తె, మోకాళ్ళబంటి ర్యాగట్ల గుంటకదిర్గి న్నాడు గద ఎక్కయ్యేది ? ముందున్నది బిడ్డ ముసుళ్ళ పండుగ !" అని నోరున్న మనిషితోటి పంతాలు వల్కినట్లు వల్కకుంట మెడతలుగు ఇడ్సిండు, బాలిగాడు.

ఎంకన్న అంకేసిండు. ఊరన్న ఊరు నాదిచ్చింది. కొట్టాలల్ల ఉన్న ఆవులన్నీ సెవులు నిక్కపొడ్సుకున్నవి. పెయ్యలు కట్లుదెంపు కున్నవి. ఎక్కడ్డీ అంకె ? ఇచ్చిత్రంగ ఉండది ! బసుపణ్ణ అంకె వెట్టి నట్లుండది. ఆ ఊళ్ళె ఉన్న నాసి రకపు కోడె లన్నీ కోసుదూరం ఉర్కినవి. ముత్తమ్మ కొట్టంల గట్టిన సీతక్క సెవు లల్ల అంకె వడ్డది. సుట్టు జూసింది సీతక్క. సక్కగ బాట వట్టింది. పసుల మందలగల్సి యాణ్ణుండో కొత్తకోడె వాస నొచ్చింది. బెదురు సూపులు జూస్కుంట నడుస్తుండది సీతక్క.

ఇంతట్లనె పక్క కోటబుర్జుమల్పు దాటి ఎంకట్రెడ్డి మంద గదిలింది. మంద కంతకు మాణిక్య మోలె ఎంకన్న వొస్తుండడు. సుట్టు

కలెజూసుకుంట. ఇంతట్లనే మురక్క చూసిండు; ఎంకన్న. కొమ్ముల్తోటి బూమిని గుమ్మి మన్ను ఎగజిమ్మిండు. పక్క మందల వొయ్యారంగ నడుస్తుండది సీతక్క. సీతక్క జూసింది ఎంకన్నను. సిగ్గువడ్డది. ఇంగింత వొయ్యారంగ మెడ గంటలు గణ గణ మనంగ దిప్పుతుండది. పక్కలపొంటి నడ్సే ఆవుదూళ్ళ కాళ్ళ నల్గ దొక్కుతుండది. “ఇదేంది ? సీతక్క ఎన్నడులేంది నాట్కం దొక్కుతుండవు ? అన్నట్లు తోటిపసురం ముందు నడుస్తుండది. మళ్లోసారి ఉంకేసిండు ఎంకన్న. సీతక్కపై జలదరిచ్చింది. పడే లోళ్ల కోడె లొచ్చి సీతక్క పక్కపొంటి నిలవడ్డవి. సీదరిచ్చుకోని బిర బిర నవ్వ తప్పిచ్చుక తిర్గింది సీతక్క. మందకు. అడ్డమొచ్చి నిలవడ్డడు ఎంకన్న. ఎక్కపట్లు వట్టింది సీతక్క. కొంతవడి పాట గాసిండు ఎంకన్న. ముందునడ్సిండు. ఎనకకొచ్చిండు పక్కపొంటి నడ్సిండు; జోడుగ నడిచిండు ఎంకన్న.

సీకట్లు వడ్డవి. భారీఎడ్లు దాణ దింటుండవి. బల్లు కుడ్తి దాగుతుండవి. పాలువిండుకోని దూళ్ళను ఇడ్సిన్రు. దినాం తీర్గ ముత్తమ్మ వొచ్చి కొట్టంల జూస్తె సీతక్క గుంజ ఖాళీ గండ్లవడ్డది. అయ్యో ! బాలిగా, సీతక్కేదిరా ? అని అడిగింది. బాలడు, బయపడ్డడు. “ఈ యాళ్లెందుకో సీతక్క సెప్పినట్లు ఇనక యాడొక్క తొలుగు తుండది. అదిలిచ్చి కొట్టుకొచ్చిన. మందల్నె గల్సిందె.” అన్నడు. ఇంతట్లనే “ఎన్నడు లేంది ఎట్ల దప్పిచ్చెరా ? మెకం గిన ముట్టలేదు గదా ?” అని అడ్గింది ముకమ్మ. “నాసత్తె ప్రమాణ మయ్యా, మంద ల్లనా సొతాగ జూసిన” అని వాడు జెప్తుంటె ఎంక్రామయ్య గాసగాడు ఎల్లడొచ్చి, “దొరసాని మీరు దేపిక యుండుంది. మీ సీతక్క మా కొత్త

కోడెలేదు. ఎంకన్న ఆ ఎంకన్న ఎంట వొచ్చింది. మా కొట్టం ల్నె ఆగింది" అన్నడు.

ముత్తమ్మ ముసిముసి నగింది. ఇంతట్లకే అడ్కి వొచ్చిన నారాయణ తోటి "ఇంటిరా ? ఉత్త పున్యానికి సీతక్క మెడన కాడిపెడ్తిరి. కంటికి ఆన్తే మా సీతక్క కా దన్నదా ?" అన్నది.

మర్నాడు మాపటికి ఎంకన్నను ఎంట బెట్టుకోని సీతక్క ముత్తమ్మ పసుల పాలెల కొచ్చింది. సీతక్క మాతె సిన్నది. కట్టుపగ్గడి లేదు. తడ్క తల్పు ఉండదు. ఎంకన్న ఎత్తుకు, దుంకుకు తడ్క తల్పు గూలి పడ్డది. తర్పి దూడలన్నీ తోకలు ల్యావట్టి దగ్గెర్క గుంపు గూడినవి. ముత్తమ్మ జూసింది. నారాయణ ఎంకట్రాంరెడ్డి కాడ్కి పసుల పోరణ్ణి దర్మి, కోడెను గొట్క పొమ్మన్నడు. ముల్లుగట్టెలు వట్టుకోని ఇద్దరుగాస గాండ్లొచ్చిన్రు. ముట్టనియ్యడు పట్టనియ్య దెంకన్న. పగ్గాన్ని దగ్గెరికే రాని య్యడు పెద్ద పామోలె బుసలు గొడ్తుండడు. ఎంకన్నను పగ్గాన పట్టవో యిన దిక్కెల్ల అడ్డం దిగ్గుతుండది కాపెక్కకండ్ల సీతక్క.

ఇదంత చిత్రంగ జూస్తుండది ముత్తమ్మ. అటు ఇటు అదిరిచ్చి పగ్గంబట్ట శాతగాక జీత గాళ్లు ములుగట్టెలు బూమి కానిచ్చి "ఇయ్యాళ్ళ మేం గాదు గద. హరి బ్రమ్మాదు లొచ్చిరా ఎంకన్నను ఈడికెల్లి కదిలియ్య లేరు. ఈ మకరు కోడెను సీతక్కను తప్పజేయ ఎవ్వరివశం? ఇంగ మేం బొయ్యి దాణబుట్టి వట్టుకొస్తం. ఈ మాపటికి ఈణ్ణే ఉండ నియ్యుండ్రి." అన్నరు. ఈ మాటిన్న నారాయణ "ఒక్క నాటి దాణ పెట్ట

లేక గాదురా! అఠుసుణ్ణి జూసి పురుసుణ్ణివోగొట్టు కొనె అన్నట్లు ఈ ఎంకన్న అంకెలు ఇని మా బక్క లన్ని మిడి గుడ్లేసి కూలె టట్లున్నవి గదరా : పంచాయితి గూల." అని అంటుంటె, "ఆ(: ఏం పంచాతి పటేలా? మళ్ళ ఆవుటియాళ్ళకు ఏనుగు లోలె కోడెలను వెత్తది సీతక్క అని అన్నరు జీతగాళ్ళు. ముక్తమ్మ ఆ మాట ఇని, "మీకు దండం బెత్త గని పదుండి పోదం. "అని అంటుంటె, ఎక్క డోళ్లక్కడ వోయిన్రు.

నెల్లాళ్లయింది. ఎంకన్నను పగ్గాన వట్టిన నరుడే లేడా వూళ్ళ. సీతక్క కట్టింది. డొక్కలు ఓలిసి నున్నగ నిగ నిగ మంటుడది. ఊళ్ళ శనా మంది ఎంకన్న ఇత్తనప్పు కోడె వోలె ఉంటె బాగుండు నను కున్నరు. అనుకోరు ? మరి ? ఎంకన్న ఎత్తు లక్ష్మి పుట్టింది సీతక్కకు. ఊరన్న ఊరు నిలవడి సూస్తరు లక్ష్మిని. కాటిక కండ్లు పక్షి సీతక్క సాలు. ఎత్తు ఒడుపు అంత ఎంకన్ననే. దిష్టి తగుల్త దని లక్ష్మి మెడల జీడిగింజలు కురువ దారంల ఏసి కట్టించింది ముక్తమ్మ. పాలనురుగోలె ఉన్న లక్ష్మి మెళ్ల నల్లటిదారం ఇంగింత దిష్టిగొట్టే టట్లు జేసింది. ఇసొంటి పెయ్య దూడను యాడ జూడ లే దంటే యాడ జూడ లే దని అంద రని వట్టిన్రు. గని దోసిళ్ల నిండ పైకం గుమ్మరిచ్చి ఎంకన్నను దెచ్చి పని పాట లేకుండ అడ్డగోలిగ ఊరి మీద ఇడ్వమంటె ఎంకట్రాం రెడ్డికి ఇష్టం గా లేదు. వోసిన పైకం బూడంగ పసురం కష్టం జేసి కొన్నో డికి ఆదెరువు గావాలె. పెట్టిన బండాలం పోంగ దినాం ఎంకన్నను గూసోవెట్టి మేప్ప మంటే తెల్లేన్గను ఇంట్ల గట్టేసుకున్నట్లె అందు కని ఎంకన్నను ఎద్దు జేసిన్రు.

పగ్గానికి జిక్కిండు ఎంకన్న. కాడికి మెడ వొంచిండు ఎంకన్న. కగ్గెట్లనడిసిండు ఎంకన్న. గడెం బోయిండు ఎంకన్న. యాపనికి ఎన్క వోడు ఎంకన్న. ఎంకన్న పనిల మున్గి తేల్తుండడు.

"ఇదేం సిత్ర మమ్మ సీతక్కకు ఒక్కటే ఈత. ఎన్కటి జన్మం ల ఈ సీతక్క మంచి పుట్టుపే ఉన్నట్లున్నది. లేకుంటే, వావి వరుసలు లేని పసురానికి ఈ కట్టు వాటేంది?" అని ఒగరు అంటే, "ఆ! ఈ ఆపు సాలే అంత గావొచ్చు. అయింది కొంది కై గట్టి చెప్పు కం అలువాటైంది మందికి. లేకుంటె నోరు లేని పసురం ఎంకన్నను దప్పిచ్చి ఏరే పసురాన్ని జారనియ్య దంటె ఎట్ల? అనే టోడు అంటే ఇనే టోడన్నా ఎట్ల ఇంటడు?" అని అన్నరు ఇంకొగరు. ఏమొ? యాది నిజమో యాది అవద్దమో గని సీతక్క ఒళ్ల కట్టనేలేదు.

సీతక్కను జూసినప్పుడల్ల ముత్తమ్మకు అప్పుం ఆ సీతమ్మ తల్లిని జూసి నట్లే అయ్యేది. లోలోపట్లనె చెంప లేసుకొని దండం బెట్టుకొనేది. అప్ప దప్ప ఎంకన్న మందల గల్సి పోతుంటె, ముత్తమ్మ మనుసుల ఏందో మెదలేది. ఆ ఊళ్ళ దగ్గెర దగ్గర వెయ్యి ఆవుంది. గని ఒక్క అవు అన్న లక్ష్మి అసుంటి పెయ్య దూడను గని, కోడె ల్యాగను గని వెట్టలేదు. ఇంతకు ముత్తమ్మ అంశవంతురాలు. లక్ష్మి పెయ్యదైనా వెయ్యిరూపాలుజేస్తది. లక్ష్మి ఈంతె నిలువెత్తు కోడెలు. ఈ కోడెల్ని గొనాల్నంటే మూల కున్న గుర్గులన్ని పీకాలె; లేకుంటె పాత గుమ్ము లన్ని మెత్తులు దీయాలె. దేని కన్న పెట్టి పుట్టాలె అని మంది అనుకో వట్టిన్రు.

దినాలు గడ్సినవి. ఏండ్లు దాటినవి. ఎంకన్న మూపురం బిగువు సళ్లింది. గంగడోలు ముడ్తలు వస్తుండది. అయినా మందల

కైనోడె ఎంకన్న ఆ యాళ్లా సీతక్క గట్టుకు వోయింది. సీకట్ల ఇంటికి రాంగ యా పురుగుముట్టిందో! కూలవడ్డది గట్టున. పసుల పోరడు జూసు కోలేదు. పసులు ఇంటికి కొచ్చినవి. అలువాటు సొప్పున ముత్తమ్మ వొచ్చి కొట్టం ల పారజూసింది. సీతక్క లేదు. పన్నెండేండ్ల ముచ్చట ఒక్కసారి ముత్తమ్మ కండ్లల్ల మెదిలింది. కాళ్లు వొణుకుడు వట్టినవి. అనుకోకుండ కండ్ల పొంటి నీళ్లొచ్చినవి. సీతక్క రాకపోతె ఇంట్ల అంద రంత పట్టిచ్చు కో లేదు; ముసలి గోవు అదే వొస్తది. గని ముత్తమ్మ కాళ్లు నిలవడలేదు. ఎందుకన్నా మంచి దని ఎంకట్రామయ్య పసుల కాడె జూసి రమ్మని కురుమణ్ణి దరిమింది. ఆకికి వొయ్యి అర్సుకొనేట్యాళ్లకు ఎంకన్నగూడ రాలేదు. సరె ఇద్దరు జీతగాండ్లు గలిసి గట్లకు బాటవట్టిన్రు. అడ్డం దిడ్డం బండ రాళ్లన్ని దాటి మేత వడ్డకాడ జూసిన్రు. పసులజాడ గాన్రాలేదు. చెకిముకి గొట్టు కుంట పొదల మాటున అల్కిడి అయిన తావున జూసిన్రు కాన్రాలే. అలుగు దుంకుడుకాడ జూసిన్రు. కాన్రాలేదు. ఏమో! యా మెకం గవిలకు ఈడ్సుక పోయిందో ఏమో! రొండుపసరాలు జవ దగ్గినవే ఆయెగదా! తెల్లారగట్ల జూతం అని ఇంటిమొకం బట్టిన్రు. ఇంతట్లనే ఎంకన్న అలికిడి ఇనొచ్చింది. అటుదిక్కు పోయి సూసె వరకు సీతక్క లేవ లేకుండ కూలపడ్డది. ఎంకన్న బాట సూపుకుంటు రొండడుగులు నడుస్తడు; మళ్ళ ఎనక్కొస్తడు. ఇట్లా సీతక్కను ఇంటికి దోల్కపోవాల్నని తండ్లాడు తుండడు. ఇట్లే సీతక్కను, ఎంకన్నను జూసి కురుమడు అడ్నే ఉండి, బాలడు ఇంటికి ఉరికిండు. బండిదెచ్చి సీతక్కను ఏస్కపోయిన్రు. ఎంకన్న ఎంటవోయిండు.

దాసరి కనుకప్ప వొచ్చి పసుర్లువిండి సీతక్క నోట్ల వోసిండు. ఇంత కింతకు సీతక్క పండ్లు కర్సకపోతుండవి. నోరు దెరువక పోతే పీకెగొట్టం బెట్టి పసురువోస్తుండరు. సీతక్క కొత్త తపుడు దిని నాం వెక్కిన గొడ్డు తీర్గ బిగిచ్చుకుం టుండది. ఎక్క డోళ్ళక్కడ పోయిన్రు.

తెల్లారింది. దబ దబ ముత్తమ్మ వొచ్చి నిలబడ్డది. ఇంత దాంక ఎంకన్న ముత్తమ్మ ఇంట్లనే ఉన్నడు. ఈ సంగతి ఎవ్వరు పట్టిచ్చుకో లేదు. సీతక్క గిజ గిజ గింజు కున్నది. తన్ను కున్నది. మూత్రిచ్చింది. తేలేసిన కండ్లుదెరిసి పెద్దగ జేసి చూసింది. ఎంకన్న గండ్ల వడ్డ దేమో! తో కాడిచ్చింది. ఎంకన్న అంబా! అన్నడు. ఇదంత జూస్తున్న ముత్తమ్మ తన కండ్లను తానే నమ్మలేదు. అనుకో కుండనే రెండుచేతులు జోడిచ్చింది.

సీతక్క వడ్డది అనంగనె పెద్దింటోడు వొచ్చిండు. సచ్చిన గొడ్డును గదిలిచ్చాలని. ఎంకన్న అడ్డం నిలవడ్డడు. కొమ్ముల తోటి కుమ్మవోతడు. సూడసిత్రం గుంది ముచ్చట. నారాయణ వొచ్చిండు. ఎంకట్రామయ్య వొచ్చిండు. రావలసి నోళ్లొచ్చిన్రు. ముత్తమ్మ సీతక్కను మన్నుజేత మన్నది. మొగోళ్ళిద్దరు నెత్తు లొంచుకోని కండ్లు దుడ్సు కున్నరు. ముత్తమ్మ నల్గుర్ని పిలిసింది. సీతక్కను గదిగిన్రు. కొమ్ములు పూజిచ్చిన్రు బండిల దీస్కపోయి సంపం జేసిన్రు.

ఎంకన్న ఇంటికి గదిలిండు పసుల మాలెల నిలవడ్డడు. ఎంకన్న దాణ దినలేదు. గాటిల గడ్డి ముట్టలేదు. తనమెళ్ళ తలుగు ఉండదో

లేదో? పెండకడి ఏయలేదు; పంచితిల లేదు. తెల్లారింది. ఎంకన్న నిజ్జునీల్గిపోయిండు. సూసింది సూడంగనే పోరడు ఉరుక్కుంటవోయి ముత్తమ్మకు ఎంకన్న సంగతి జెప్పిండు. ఇండ్లు యాడ్వీ యాడపెట్టి నారాయణను దోల్కొని ముత్తమ్మ ఎంకన్న కాడికి వొచ్చిచూసింది. నిజంగనే ఎంకన్న లేడు. ఆడ్కివొచ్చి నిలవడ్డ ఎంకట్రామయ్యను జూసి "అన్నా, ఎంకన్న సీతక్క కాడ్కి వోయిం డన్నా" అని మొకాన కొంగు వెట్టుకోని బాపురుమన్నది. అనుకోకుండ ఎంకన్న గొడ్డు అన్న మాట మరిసి అందరు ఓ అని ఎడ్సిన్రు.

లోకం ల లేని ఈ సిత్రం జూడ ఊరన్నఊరు కట్టున గదిలిన్రు. "ఇవి పసురాలు గావు; దేవలోకం పుట్టుకలు" అన్నరు. ఆ డోళ్లంత "సామితల్లి గౌరమ్మ సీతక్కతీరు సావు మా కియ్యి" అని పుస్తైవొట్లు కండ్లకద్దు కున్నరు. "సీతక్కకన్న పుణ్యం ఎంకన్న ది రా. జంటమీన ఎంత ఆరివారం ఉంటేమట్క ఇదేం అదునుకాలం గన్క నా? యాదో పిట్టల జంటల పెంటి వోతె పోతు బత్కది. పోతు వోతే పెంటి నిల్వదు- అనంగ ఇన్నం గని; తల్లి పిల్లకు ఏరుతారు జూడని యీ గొడ్ల ముచ్చట కండ్లముందల జూసిసి. ఏందో మైన్కరం తీర్గనె ఉండవి." అని అన్నరు.

ఆ యాళ్ల ఎవ్వరు పనిపాటలు అర్సుకో లేదు. తిండి తిప్ప లనలేదు. తన మనోడు వోతే నట్లురు నాల్గు చేతులేసి నట్లు అందరు అన్నీ జమజేసిన్రు. బుక్కయాదయ్య బుక్క గులాలు దెచ్చిండు. నారాయణ ప్యాట్లకు మనిషిని దర్మి పూలదండలు దెప్పిచ్చిండు. ఎంకట్రామయ్య గులాం రసూల్తాన పన్నీరుసీస దెప్పిచ్చిండు. పిలవకుండనే బైండ్లోండ్లు

గవ్వలబింకి దెచ్చిన్రు. హరిదాసు ఎక్తారు వట్టుకొచ్చిండు. కావలి రాంలు సిడుంగిట్టి గజ్జల కట్టి దెచ్చి నిలవడ్డడు. బజంత్రీలు సన్నాయిపీకె దెచ్చిన్రు. తప్పెట్లొచ్చినవి. ఏమి పండుగ! ఏమి? లొల్లి! ఏమి సంబురం! ఆ నాడు కులం, తలం లేదు. చిన్నా పెద్దా లేదు. ఒకరి చేతుల పని ఒగరు అందుకుంటుండరు.

అంత తయారైంది. పెద్దబండి వొచ్చింది. మామిడి ఆకుతోటి పూజిచ్చి తెచ్చిన్రు. మనిషికి జేసినట్లు ఆఖరుసారి ఎంకన్నకు జేయవల్సిన అలంకారం అంత జేసిన్రు. అయ్యగారొచ్చిండు. మంత్రపునీళ్ళు సల్లిండు. గోవిందా గోవింద అనుకుంట ఎంకన్నను బండి ఎక్కిచ్చిన్రు. బండిమెల్లగ రథం గదిలినట్లు గదిలింది. ఊరబాయి కాడికొచ్చిన్రు. సీతక్కను మన్నుజేసిన కాడ్నే పక్కపొంటి తోగిన్రు.

ఎంకన్నను తాళ్ళుగట్టి మెల్లగ దించిన్రు. ఉప్పు బస్తాలొచ్చినవి. తొలిసారి పిడికెడు ముత్తమ్మ ఏసింది మంది ఇర్సుకపడ్డరు. ఆడి మొగ తలా పిడికెడు రొండు బస్తాలు కండ్లుమూసి తెరిసెటాల్లకు అయిపోయినవి. ఎంకన్నకు అందరు ఋణ పడ్డట్లు తలా ఓ పిడికెడు మన్నేసిన్రు. సీతక్క పక్కన ఎంకన్న పండుకున్నడు. అందరు బాయికాడిక్కె నడ్సి స్తానాలుజేసి ఇంటికొచ్చిన్రు. సీతక్కకు ఎంకన్నకు గలిపి ఒకటే అరుగు గట్టి గచ్చుజేసిన్రు.

ఊళ్ళ ఏ తల్లి నీళ్ళాడినా, యా పిల్లకు కొత్తగ పెండ్లయినా. పొలిమేరరాళ్ళు గట్టినా. సీతక్క అరుగు లెక్క. సీతక్క అరుగు సుట్టూ గున్నమామిళ్లేసిన్రు కాతాపూతా నిండుగుంటవి ఆ చెట్లు ఆవ్వాళ్ళ ఎవ్వరివీ గావు. ఊరందరివీ ఆ చెట్లు. ఏరూరి నుండి వొచ్చిపొయ్యే బాటసార్లు సద్ది ముల్లెలు ఇప్పుకోని, సీతక్క అర్గుమీద గూసోని తిని, ఊరబాయినీళ్లు దాగి సీతక్క ఎంకన్న కతలు సిత్రంగ జెప్పుకుంటరు.